క్లుప్తంగా

వసతులపై ఆరా



వసతులు పరిశీలిస్తున్న ఎంపీడీవో, ఎంపీవో

వేమనపల్లి: మండలంలోని దస్నాపూర్ క్రాస్ రోడ్డు వద్ద ఉన్న గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఎంపీడీవో కుమారస్వామి, ఎంపీవో శ్రీనివాస్‌రెడ్డి తనిఖీ చేశారు. వసతులపై ఆరా తీశారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా అని విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధిహామీ నిధులతో నిర్మిస్తున్న పశువుల పాక, పాఠశాలల ప్రహరీ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

బీసీ సంఘాల ఆధ్వర్యంలో సంబురాలు

జన్నారం: బీసీ రిజర్వేషన్ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదించడంపై బీసీ కులాల ఉద్యమ పోరాట సమితి బుధవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో సంబురాలు జరుపుకున్నారు. బీసీ ఉద్యమ పోరాట సమితి ఉమ్మడి జిల్లా కన్వీనర్ కొడూరి చంద్రయ్య మాట్లాడుతూ.. ఎన్నో సంవత్సరాలుగా బీసీ సంఘాలు చేస్తున్న పోరాటం ఫలించిందన్నారు. బీసీ బిల్లును ఆమోదించడంతో సీఎం రేవంత్‌రెడ్డికి, ఆమోదించిన ప్రతిపక్ష నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట టపాసులు కాల్చి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో బీసీ ఉద్యమ పోరాట సమితి జిల్లా నాయకులు నర్సయ్య, లక్ష్మీనారాయణ, గంగాధర్‌గౌడ్, అశోక్, రాగుల శంకర్, మూల భాస్కర్, ఐలవేని రవి, పురుషోత్తం, శ్రీనివాస్, శ్రీనివాసగౌడ్, నాగేందర్, రమణ , వెంకటేశ్, మధు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి మేకల వారసంత వేలం

తాండూర్: మండలంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీలో శనివారం మేకల వారసంతకు బుధవారం డీఎల్‌పీవో సఫ్దార్ అలీ, మండల పంచాయతీ అధికారి అనిల్‌కుమార్ పర్యవేక్షణలో బహిరంగ వేలం నిర్వహించారు. దేవాపూర్ గ్రామానికి చెందిన ఎల్లబోయిన సతీష్ అత్యధికంగా రూ.12లక్షల 10వేలకు వేలం పాడి మేకల వారసంతను దక్కించుకున్నాడు. కూరగాయల సంతకు వేలం నిర్వహించలేదు. ప్రభుత్వం నిర్ణయించిన ధర రాకపోవడంతో తిరిగి ఈ నెల 24న బహిరంగ వేలం నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. కార్యక్రమంలో సీఐ కుమారస్వామి, గ్రామ పెద్దలు, డిపాజిట్‌దారులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.


తైబజార్ వేలం వాయిదా

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని తైబజార్ వేలం వాయిదా పడినట్లు బుధవారం మున్సిపల్ కార్యాలయ మేనేజర్ కృష్ణప్రసాద్ తెలిపారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన తైబజార్ వేలం ఉండగా నలుగురు దరఖాస్తు చేసుకున్నారు. గత ఆర్థిక సంవత్సరం రూ.4.29 లక్షలకు తైబజార్ వేలం కాగా, ఈ ఆర్థిక సంవత్సరానికి 10శాతం అంటే రూ.4.72లక్షల సర్కార్ వేలం నిర్ణయించారు. దరఖాస్తు చేసుకుని వేలంలో పాల్గొన్నవారు అభ్యంతరం తెలుపడంతో 25 తేదీకి వాయిదా వేసినట్లు తెలిపారు.

అప్రకటిత విద్యుత్ కోతలతో పంటలకు ఇబ్బందులు

భీమారం: మండలంలోని ధర్మారం, రెడ్డిపల్లి గ్రామాల్లో వ్యవసాయరంగానికి సరఫరా చేసే విద్యుత్తు సరఫరాలో అప్రకటిత కోతలు విధిస్తున్నారని రెండు గ్రామాల రైతులు తెలిపారు. కొన్నిరోజుల నుంచి రోజులో కనీసం 5గంటల పాటు కోతలు విధిస్తున్నారని వాపోయారు. వేసవి ఎండలు తీవ్రతరం కావడంతో వరిపొలాలకు నీటి వినియోగం పెరిగిందని తెలిపారు. అయితే పంటలకు సరిపోను నీళ్లు అందించేందుకు ప్రయత్నాలు చేసినప్పటికీ, విద్యుత్తు కోతలతో మోటార్లు నడవటం లేదన్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే వారం రోజుల్లో వరిపంటకు నీరు లేక ఎండిపోయే ప్రమాదం ఉందన్నారు. విద్యుత్తు శాఖ అధికారులు చర్యలు తీసుకొని కోతలు ఎత్తివేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న దేవయ్య

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలోని బీఆర్ అంబేడ్కర్ చౌరస్తా వద్ద బుధవారం చలివేంద్రం ప్రారంభమైంది. జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో ఎన్.దేవయ్య ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్‌కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో జనహిత సేవా సమితి అధ్యక్షుడు ఆడేపు సతీష్, మాజీ కౌన్సిలర్ జి.రాజలింగు, జనహిత సభ్యులు పాల్గొన్నారు.

జోరుగా.. హుషారుగా

జన్నారం/జైపూర్/చెన్నూర్‌రూరల్/భీమిని/దండేపల్లి: జన్నారం మండలంలోని అక్కపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో వార్షికోత్సవం, జైపూర్ మండలంలోని ఇందారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, చెన్నూర్ మండలంలోని సుద్దాల జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో, భీమిని మండలంలోని వీగాం జిల్లా పరిషత్ పాఠశాలలో, దండేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల, వెల్గనూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో వీడ్కోలు సమావేశాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు నృత్య, నాటిక ప్రదర్శనల్లో హుషారుగా పాల్గొన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు పలువురు వక్తలు తెలిపారు. ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జన్నారంలో...



వీగాం పాఠశాలలో...



సుద్దాల జెడ్పీఎస్ఎస్‌లో నృత్యం చేస్తున్న విద్యార్థినులు



జైపూర్: నృత్యం చేస్తున్న విద్యార్థినులు



దండేపల్లి: నృత్యం చేస్తున్న విద్యార్థినులు

పల్లె దవాఖానాలకు సుస్తీ..!



హాజీపూర్‌లో అద్దె భవనంలో కొనసాగుతున్న పల్లె దవాఖాన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): పల్లె ప్రజలకు ఉచితంగా నాణ్యమైన వైద్యం అందించడంతో పాటు వైద్యం మరింత చేరువ కావాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం పల్లె దవాఖానాలు ఏర్పాటు చేసింది. పక్కా భవనాలు ఉండాలనే నిర్ణయంతో హాజీపూర్ మండలానికి 6 పల్లె దవాఖానాలు మంజూరయ్యాయి. గఢ్‌పూర్, దొనబండ గ్రామాల్లో ప్రభుత్వ భవనాల్లో పల్లె దవాఖానాలు కొనసాగుతుండగా, నంనూర్‌లో ఇంకా భూ సేకరణ పూర్తి కాలేదు. ముల్కల్ల, కర్ణమామిడి గ్రామాల్లో భవన నిర్మాణాలు ప్రారంభమైనా సంబంధిత కాంట్రాక్టర్ బిల్లులు రావడం లేదని నిర్మాణ పనులు మధ్యలోనే ఆపేశాడు. హాజీపూర్‌లోని పల్లె దవాఖానా నూతన భవనం పూర్తయినా కాంట్రాక్టర్‌కు బిల్లులు రావడం లేదని విద్యుత్, నీటి వసతి ఏర్పాట్లు చేయించకపోవడంతో ఆ భవనం ఇంకా వినియోగంలోకి రాలేదు. దీంతో హాజీపూర్ పల్లె దవాఖానా ప్రస్తుతం అద్దె భవనంలో కొనసాగుతోంది. కాగా అసంపూర్తి నిర్మాణాలతో ఉన్న పల్లె దవాఖానాల భవనాల అద్దాలు పగిలిపోవడం, భవనాలకు పగుళ్లు రావడంతో పాటు అసాంఘిక కార్యాకలాపాలకు అడ్డాలుగా మారుతున్నాయి.



కర్ణమామిడిలో మధ్యలో నిలిచిన పనులు

23న తెలంగాణ ప్రజాఫంట్ మహాసభలు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలో ఈ నెల 23న తెలంగాణ ప్రజాఫంట్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ప్రజాఫంట్ జిల్లా కన్వీనర్ జైపాల్ సింగ్ అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం మహాసభ కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రజాఫంట్ కో కన్వీనర్ చంద్రయ్య, కార్యదర్శి పోషన్న, ప్ర జాకళా మండలి జిల్లా అధ్యక్షుడు సమ్మయ్య పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

అడిషనల్ కలెక్టర్‌కు వినతి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని రెడ్డి సామాజిక వర్గంలో ఆర్థికంగా వెనుకబడిన ఈడబ్ల్యూఎస్ వారికి వర్తింపజేయాలని జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు కోరారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో బుధవారం అడిషనల్ కలెక్టర్ మోతీలాల్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు గుర్రం మోహన్‌రెడ్డి, నరహరి శ్రీధర్‌రెడ్డి, మద్దుల మనోహర్‌రెడ్డి, మోతే రాఘవ రెడ్డి, అనుమాండ్ల వెంకట్‌రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, రాజబాపురెడ్డి పాల్గొన్నారు.

'వేధింపులు భరించలేకనే ఆత్మహత్య'

మందమర్రిరూరల్: గత నెల 28న మంచిర్యాలలో రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్న వినయ్ మృతికి కారణమైన వారిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని వినయ్ భార్య భాగ్యలక్ష్మి డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం కుటుంబసభ్యులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రామకాలనీకి చెందిన ఓ మహిళతో ఉన్నటువంటి సంబంధం వల్ల కొందరు పెద్ద మనుషులు వేధించారని, వేధింపులు భరించలేకనే తన భర్త ఆత్మహత్య చేసుకున్నట్లు ఆమె ఆరోపించారు. ఆత్మహత్యకు కారకులైన వారిపై రైల్వే, స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. కేసును మందమర్రి పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేసి, విచారణ జరిపించి న్యాయం చేయాలని కోరారు.

కష్టపడి కాదు.. ఇష్టపడి చదవండి

- విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత



భీమారం: ప్యాడ్లు పంపిణీ చేస్తున్న సీఐ వేణుచందర్

భీమారం/దండేపల్లి/నెన్నెల/తాండూర్/చెన్నూర్ రూరల్/మంచిర్యాలఅర్బన్: పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పలు పాఠశాలల విద్యార్థులకు రాజకీయ నాయకులు, అధికారులు తమవంతుగా విద్యాసామగ్రి అందజేస్తూ విద్యార్థులకు తోడుగా నిలుస్తున్నారు. ఒత్తిడికి లోను కావొద్దని, కష్టపడి కాదు.. ఇష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని హితబోధ చేశారు.

- చెన్నూర్‌కు చెందిన ప్రముఖ గోల్డ్‌స్మిత్ వ్యాపారి, వాకర్స్ సభ్యుడు సద్దనపు వేణుగోపాల్ మండలంలోని సుద్దాల గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో చదువుతున్న 75మంది విద్యార్థులకు బుధవారం పరీక్ష సామగ్రి అందజేశారు.
- భీమారంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో కానిస్టేబుల్స్ మేకల శ్రీకాంత్, ఎస్‌కే నిహాల్ తమ మొదటి వేతనంతో పరీక్ష సామగ్రి కొనుగోలు చేసి, సీఐ వేణుచందర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు.
- జిల్లా కేంద్రంలోని గర్మిళ్ల ప్రభుత్వ పాఠశాలలో బీజేపీ ఆధ్వర్యంలో జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్, నాయకులు సాయికృష్ణ, మహేశ్, నరేశ్, సతీశ్ 25మంది విద్యార్థులకు ఎగ్జామ్ మెటీరియల్ అందజేశారు.
- దండేపల్లిలోని గుడిరేవు జెడ్పీ ఉన్నత పాఠశాలలో అదే గ్రామానికి చెందిన సంతపురి మనోజ్ పరీక్ష సామగ్రి అందించారు.
- నెన్నెల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు రమేష్ కొనుగోలు చేసిన సామగ్రిని ఎంఈవో చంద్రశేఖర్‌రెడ్డి పంపిణీ చేశారు.
- తాండూర్ మండలంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులు పురంశెట్టి అరుణ్‌కుమార్ 42మంది బాలికలకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు.

మందకృష్ణ పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ

పాతమంచిర్యాల: 30ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ కోసం చేసిన పోరాటాల వల్లే ఎస్సీ మూడు గ్రూపుల వర్గీకరణ జరిగినట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య తెలిపారు. జిల్లా కేంద్రంలో బుధవారం మందకృష్ణ మాదిగ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు శ్రీనివాస్, మల్లేష్, వెంకన్న, గుడిశెల దశరథం, నక్క అంజన్న, నారాయణ, ప్రసాద్, జంపన్న, అరుణ్, రవీందర్, రాజలింగు పాల్గొన్నారు.



క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సక్రమంగా విధులు నిర్వహించాలి



కారుణ్య నియామకపత్రాలు తీసుకున్న వారితో జీఎం శ్రీనివాస్


శ్రీరాంపూర్: సింగరేణిలో కొత్తగా చేరిన ఉద్యోగులు సక్రమంగా విధులు నిర్వర్తించాలని శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఆయన జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో 52మంది యువతీ, యువకులకు కారుణ్య ఉద్యోగ నియామక పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగరేణిలో ఉద్యోగం చేయడం అదృష్టంగా భావించాలన్నారు. ఉద్యోగంలో చేరిన వెంటనే సర్ఫేస్‌లో లైట్ జాబ్ కావాలని అధికారులపై ఒత్తిడి తేవద్దన్నారు. క్రమశిక్షణతో పని చేయాలని సూచించారు. రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని, అదే సింగరేణికి శ్రీరామరక్ష అన్నారు. శ్రీరాంపూర్‌లో ఇప్పటి వరకు 3784మందికి కారుణ్య ఉద్యోగ నియామక పత్రాలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏరియా ఎస్‌ఓటు జీఎం సత్యనారాయణ, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీ సైదా, డీజీఎం (పర్సనల్) అరవిందరావు, సీనియర్ పీఓ కాంతారావు, అసిస్టెంట్ సూపరింటెండెంట్ సత్యనారాయణ పాల్గొన్నారు.

వార్షికోత్సవ ఏర్పాట్ల పరిశీలన

శ్రీరాంపూర్: సింగరేణి పాలిటెక్నిక్ కాలేజీ 17వ వార్షికోత్సవాన్ని ఈ నెల 22న ఘనంగా నిర్వహిస్తున్నట్లు శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్ తెలిపారు. పాలిటెక్నిక్ కాలేజ్ వద్ద బుధవారం ఆయన వేడుకల ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సారి పెద్ద ఎత్తున వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సింగరేణి సీఎండీ బలరాంనాయక్, డైరెక్టర్లు సత్యనారాయణ రావు, ఎల్వీ సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరి యా ఎస్‌ఓటు జీఎం సత్యనారాయణ, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, డీజీఎం(సివిల్) ఆనంద్‌కుమార్, పాలిటెక్నిక్ కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నరసింహస్వామి, వర్క్‌షాప్ డీజీఎం రవీందర్ పాల్గొన్నారు.

క్వార్టర్ల కేటాయింపు కోసం కౌన్సెలింగ్

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని కార్మికులకు కేటాయింపు క్వార్టర్ల కోసం ఏరియాలోని సీఈఆర్ క్లబ్ ఆవరణలో అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించారు. 93క్వార్టర్లకు నోటిఫికేషన్ వేయగా 54మంది కౌన్సెలింగ్‌లో పాల్గొన్నారు. సీనియార్టీ ప్రకారం మందమర్రి, శ్రీరాంపూర్ ఏరియాల్లో పనిచేసే 21మందికి క్వార్టర్లు కేటాయించినట్లు అధికారులు తెలిపారు. కౌన్సెలింగ్‌లో ఎస్వోటు జీఎం విజయ్‌ప్రసాద్, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, ఐఈడీ రాజన్న, డీవైపీఎం మైత్రేయబంధు ఉన్నారు.



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

■ బొగ్గుబాయి వార్తలు

లైజన్ అధికారులకు గుర్తింపునివ్వాలి

శ్రీరాంపూర్: సింగరేణి వ్యాప్తంగా 11డివిజన్లలో ఇటీవల బీసీ లైజనింగ్ ఆఫీసర్లను యాజమాన్యం నియమించినా, వారికి సరైన గుర్తింపు ఇవ్వడం లేదని టీబీజీకేఎస్ కేంద్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, ఏరియా ఉపాధ్యక్షులు పెట్టం లక్ష్మణ్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బండి రమేష్, నాయకులు పొగాకు రమేష్, అన్వేష్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లైజన్ అధికారుల పరిచయ కార్యక్రమం కూడా నిర్వహించలేదన్నారు. లైసెన్ అధికారులను నియమించినట్లు ఉద్యోగులకు తెలిసేలా గనులు, డిపార్టుమెంట్లకు ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేదన్నారు. లైజన్ అధికారుల పేర్లు, హోదాలను వారి ఫోన్ నంబర్లను, గనులు, డిపార్టుమెంట్లపై ముద్రించాలని సూచించారు. రిజిస్టర్ ట్రేడ్ యూనియన్ నాయకులతో బీసీ ఉద్యోగుల సమస్యలపై చర్చించడానికి సమావేశాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

లైజన్ అధికారికి సన్మానం

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియా బీసీ లైజన్ అధికారిగా నియమితులైన ఏరియా ఎస్‌ఓటు జీఎం సత్యనారాయణను గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు బుధవారం జీఎం కార్యాలయంలోని ఆయన ఛాంబర్‌లో ఘనంగా సన్మానించారు. పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. బీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు.

మెరుగైన ఉత్తీర్ణత సాధించాలి

శ్రీరాంపూర్: పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఉత్తీర్ణత సాధించాలని శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్ తెలిపారు. సీసీసీలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో బుధవారం 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం విద్యార్థులకు హాల్ టికెట్లు పంపిణీ చేశారు. పూర్వ విద్యార్థుల సంఘం తరపున విద్యార్థులకు పరీక్ష మెటీరియల్ అందించారు.

సంక్షిప్త వార్తలు

● పోలీసుల విస్తృత తనిఖీలు

భీమిని: కన్నెపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో నిషేధిత నకిలీ పత్తి విత్తనాలు ఉన్నయన్న అనుమానంతో బుధవారం పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. పాత నేరస్తులు పున్నపురెడ్డి చెందు, పుట్ట అశోక్ ఇళ్లలో సోదాలు నిర్వహించారు. అనంతరం ఎస్సై గంగారాం రైతులకు నకిలీ విత్తనాలు వాడడం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు.

● హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా ఎంపిక

మందమర్రిరరూరల్: మందమర్రి మండలం ఆదిల్‌పేట్ గ్రామంలోని వ్యవసాయ కుటుంబానికి చెందిన నెండుగూరి చిన్నక్క–శంకర్ దంపతుల కుమారుడు రాజేశం హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ (హెచ్‌డబ్ల్యూవో) పోస్టుకు ఎంపికయ్యాడు. బుధవారం ఆయనను గ్రామస్తులు అభినందించారు.

● మంచి ఆహార అలవాట్లు అలవర్చుకోవాలి

వేమనపల్లి: విద్యార్థినులు మంచి ఆహారపు అలవాట్లు అలవర్చుకోవాలని ఎంఈవో శ్రీధర్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సువర్ణ అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ స్కూల్లో బుధవారం మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా మహిళా సాధికారిక కేంద్రం ఆధ్వర్యంలో పరిశుభ్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. బాలికలు పాటించాల్సిన ఆహార నియమాలు, నెలసరి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను మహిళా సాధికారికత జెండర్ స్పెషలిస్ట్ విజయ వివరించారు.

● విద్యుత్ అధికారుల 'పొలంబాట'

చెన్నూర్‌రూరల్: మండలంలోని పొన్నారం గ్రామంలో ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశాల మేరకు ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో బుధవారం పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. విద్యుత్ సమస్యలపై అధికారులు రైతులకు తెలియజేశారు.

● అర్హుల జాబితా సిద్ధం చేయండి

వేమనపల్లి: మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అర్హుల జాబితాను సిద్ధం చేయాలని మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో మండల సాధారణ సమావేశం నిర్వహించారు. అన్ని గ్రామపంచాయతీల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని, ఇంటి పన్ను బకాయిలు వందశాతం పూర్తి చేయాలని కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కుమారస్వామి, తహసీల్దార్ రమేష్, ఎంపీవో శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● ఉత్తమ ఫలితాలు సాధించాలి

లక్సెట్టిపేట: విద్యార్థులు వార్షిక పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చాలని మండల విద్యాధికారి హెలెన్ దారతి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం యూఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మార్చి 10వ తేదీన మండలంలోని ఏడు పాఠశాలల విద్యార్థులకు టాలెంట్ పరీక్ష నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబర్చిన 14మంది విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్సై రామయ్య, ప్రిన్సిపాల్ శైలజ, విద్యార్థి సంఘం నాయకులు మిట్టపల్లి తిరుపతి పాల్గొన్నారు.

● బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు

కోటపల్లి: అసెంబ్లీ సమావేశాల్లో బడ్జెట్ ప్రవేశపెడుతున్న నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులను కోటపల్లి పోలీసులు ముందస్తు అరెస్టు చేసి కోటపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టైన వారిలో నాయకులు పిల్లి సమ్మయ్య, అక్కల మధుకర్, శ్యాం, కొట్టె నారాయణ ఉన్నారు.

● సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

శ్రీరాంపూర్: దొంగతనాల, నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియాలో కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా వీధి వ్యాపారులకు దొంగతనాలు, నేరాలపై అవగాహన కల్పించారు.